క్లుప్తంగా

ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలి



ఫ్యామిలీ హెల్త్‌కార్డును ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(హాస్పిటల్): ప్రతిఒక్కరూ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య చెప్పారు. ఆమె బుధవారం తన ఛాంబర్‌లో మెడికవర్ హాస్పిటల్ వారు రూపొందించిన ఫ్యామిలీ హెల్త్ కార్డును ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. ఆర్థిక స్థోమత లేదని చింతించకుండా కుటుంబ సంరక్షణకు ప్రతిఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేస్తారని, అలాంటి వారికి హెల్త్‌కార్డులు ఉపయోగపడతాయన్నారు. మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ఫ్యామిలీ హెల్త్‌కార్డు పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, దీని ద్వారా ప్రతి ఆరోగ్యసేవపై మెరుగైన డిస్కౌంట్లు ఉంటాయన్నారు. మార్కెటింగ్ హెడ్ షేక్ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

తపోవన్ మహారాజ్ జయంతి



ప్రత్యేక అలంకరణలో దేవతా మూర్తులు

కర్నూలు కల్చరల్: స్థానిక వీఆర్ కాలనీలోని చిన్మయ మిషన్ ప్రభావళిలో బుధవారం గీతా జయంతి, తపోవన్ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భగవద్గీతలోని 18 అధ్యాయాలను పారాయణం చేశారు. మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతి సందేశమిచ్చారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



అయ్యప్పస్వామి పడి పూజలో పాల్గొన్న ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులు


కర్నూలు కల్చరల్: నగరంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో బుధవారం అయ్యప్ప స్వామి పడి పూజను ఘనంగా నిర్వహించారు. భాస్కర్‌నగర్ అయ్యప్ప స్వామి ఆలయ పూజరి బాల స్వామి అయ్యప్పస్వామికి అభిషేకం, అర్చన, పడి పూజలు చేశారు. అయ్యప్పస్వామి భజన ప్రత్యేకంగా నిలిచింది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కేడీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆడిట్‌కు అందని సహకారం

- సహకరించని ఉద్యోగులపై సూపరింటెండెంట్ ఆగ్రహం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గత 20 రోజులుగా ఏజీ ఆడిట్ నిర్వహిస్తున్నారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ చాంబర్‌లో ముగ్గురు సభ్యుల బృందం ఆడిట్ నిర్వహిస్తోంది. దాదాపు ఆరేళ్ల తర్వాత ఆడిట్‌కు రావడంతో ఫైళ్ల సంఖ్య అధికమైంది. ఈ క్రమంలో కొందరు ఉద్యోగులు ఆడిట్ బృందం అడిగిన ఫైళ్లు వారి ముందు ఉంచి వస్తున్నారు. అయితే తమకు ఫైళ్ల గురించి వివరంగా చెప్పడం లేదంటూ సూపరింటెండెంట్‌కు ఆడిట్ బృందం ఫిర్యాదు చేసింది. కొందరు ఉద్యోగులు తమకు సహకరించడం లేదని పేర్కొంది. కొన్ని ఫైళ్లు అర్థం కావడం లేదని, అడిగితే స్పందించడం లేదని ఆరోపించింది. ఆసుపత్రిలో గత కొన్నేళ్లుగా వైద్యపరికరాలు, స్టేషనరీ, సివిల్ పనులు, ఇతర వస్తువుల కొనుగోలు, పెట్టిన ఖర్చుకు సంబంధించిన వివరాలు, బిల్లులు సక్రమంగా లేవని ఆడిట్ అధికారులు చెప్పినట్లు తెలుస్తోంది. ఈ మేరకు బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు పలువురు ఉద్యోగులను తన చాంబర్‌లోకి పిలిచి మందలించినట్లు సమాచారం. ఆడిట్ అధికారులు అడిగిన సమాచారం ఇవ్వడంతో పాటు వారికి వివరంగా చెప్పాలని ఆదేశించినట్లు తెలిసింది.

సాక్షి సినిమాలు



- ఎస్వీసీ కాంప్లెక్స్ : పుష్ప 2 : ది రూల్
- వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : పుష్ప 2 : ది రూల్, అమరన్
- వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : పుష్ప 2 : ది రూల్, లక్కీ భాస్కర్
- శ్రీరామ : పుష్ప 2 : ది రూల్
- రాజ్ : పుష్ప 2 : ది రూల్
- భరత్ కాంప్లెక్స్ : పుష్ప 2 : ది రూల్
- విజయ థియేటర్ : పుష్ప 2 : ది రూల్
- విక్టరీ టాకీస్ : లక్కీ భాస్కర్

అనధికార లేఅవుట్లపై చర్యలేవీ?

- నగరపాలకలో లెక్కలేనన్ని అక్రమ లేఅవుట్లు
- ప్రభుత్వానికి నివేదించినా చర్యల్లేవు
- అమ్మకాలు, కొనుగోళ్ల రిజిస్ట్రేషన్లకు బ్రేక్
- చట్టపరమైన చర్యలకు అంతులేని జాప్యం

➤ నగర పాలక సంస్థ పరిధిలోని ఆటోనగర్ సమీపంలో రాగమయూరి కమర్షియల్ స్ట్రీట్ పేరుతో వెంచర్ వెలసింది. సర్వే నంబర్ 386/3లో 1.6 ఎకరాల విస్తీర్ణంలో వెలసిన ఈ వెంచర్‌కు ఇటు నగరపాలక సంస్థలో కానీ, ఎకరంపైన స్థలం కావడంతో అటు 'కుడా' (కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) అనుమతులు సైతం తీసుకోలేదు. నిబంధనల ప్రకారం ఓపెన్ స్థలం చూపించలేదు. ఇటీవల నగరపాలక అధికారులు దీన్ని అనధికారికంగా వెలసిన వెంచర్‌గా గుర్తించారు. ఇప్పటికి ఆరు నెలలు అవుతున్నా ఎలాంటి చర్యలు లేవు.

➤ ఐదేళ్ల క్రితం నగరపాలకలో విలీనమైన లక్ష్మీపురం వద్ద సర్వే నంబర్ 774 (పి), 775(పి), 776(పి)లోని 3.75 ఎకరాల్లో అనుమతులు తీసుకోకుండా వెంచర్లు వెలిశాయి. కుడా అనుమతులు లేకుండా వెంచర్లు వేసినట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు గుర్తించారు. అయినా ఇప్పటివరకు చర్యల్లేవు.

➤ జొహరాపురంలో జె.జె.బిల్డర్స్ పేరుతో సర్వే నంబర్ 165/2 ఏలో 4.37 ఎకరాల్లో అనుమతులు లేకుండా వెంచర్లు వేశారు. ఇదే ఏరియాలో జి.ఎస్.ఆర్ కాలనీలో సర్వే నంబర్ 154లో 4 ఎకరాల్లో కుడా, నగరపాలక సంస్థ అనుమతులు లేకుండా వెంచర్లు వేశారు. అడ్డగోలుగా అనుమతులు లేకుండా వెలసిన ఈ వెంచర్లపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం అంతులేని జాప్యం చేయడం వెనుక అంతర్యమేంటో అర్థం కావడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

– కర్నూలు (టౌన్)

ఇటీవల జిల్లా కేంద్రం నడిబొడ్డున అక్రమ వెంచర్లు అడ్డగోలుగా వెలిశాయి. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు, కర్నూలు డెవలప్‌మెంటు అథారిటీకి చెందిన ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు ఉండే జిల్లా కేంద్రంలో ఒకటి కాదు.. రెండు కాదు. లెక్కలేనన్ని అక్రమాలు వెలుగు చూశాయి. నగర పరిధిలో ఏకంగా 99 ఎకరాల్లో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అందమైన బ్రోచర్లను ముద్రించిన రియల్ ఎస్టేట్ యజమానులు ప్లాట్లను ప్రజలకు అమ్మేసి సొమ్ము చేసుకున్నారు. కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని జొహరాపురం, మామిదాలపాడు, లక్ష్మీపురం, పందిపాడు, కల్లూరు, మునగాలపాడు, పెద్దపాడు వంటి శివారు ప్రాంతాల్లో అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలు వెలిశాయి.

కుడా, టౌన్ ప్లానింగ్ అధికారులు ఏంచేస్తున్నారో?

లెక్కలేనన్ని అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలు వెలుస్తుంటే కుడా, టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. అక్రమంగా భవన నిర్మాణం, అపార్టుమెంటు, వాణిజ్య భవనం, లేఅవుట్లు వెలుస్తున్నా అధికారులకు కనిపించకపోవడం విడ్డూరంగా ఉంది. రూ.లక్షల్లో చేతులు మారాయని సంబంధిత విభాగానికి చెందిన కింది స్థాయి ఉద్యోగులు ఫిర్యాదులు చేస్తున్నారు. అనుమతులు లేని వెంచర్లలో 'కుడా'లోని ఓ ముఖ్య అధికారి రూ.లక్షలు వసూలు చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు వచ్చినా అప్పట్లో విజిలెన్స్ అధికారులు ముందుకు కదల్లేదని చెబుతున్నారు. అందుకే ఎకరాల కొద్ది అక్రమ లేఔట్లు వెలిశాయి. ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా, ఆ తరువాత మిన్నకుండిపోయింది.



అనుమతుల్లేకుండా ఏర్పాటు చేసిన రాగమయూరి కమర్షియల్ పార్కు

రిజిస్ట్రేషన్లకు బ్రేక్

కర్నూలు నగరపాలక సంస్థలో పెద్దఎత్తున అక్రమ నిర్మాణాలు, వెంచర్లు వెలిసినట్లు గుర్తించడంతో ఆలస్యంగానైన ప్రభుత్వం స్పందించింది. నగర పరిధిలో 99 ఎకరాల్లో అనుమతులు లేకుండా వెలసిన వెంచర్లకు సంబంధించి రిజిస్ట్రేషన్లు నిలిపివేసింది. ఇష్టానుసారంగా అనుమతులు లేకుండా వెలుస్తున్న ఈ వెంచర్లలో కోనుగోలు చేస్తే అప్రూవల్, బ్యాంకు రుణాలు వచ్చే అవకాశం లేకపావడంతో ప్రభుత్వం ఈ రిజిస్ట్రేషన్లను నిలిపివేసేందుకు నిర్ణయించింది. అక్రమమని తెలిసినా చర్యలు తీసుకోవడం లేదు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించినా అచరణలో విఫలం చెందిందన్న విమర్శలు ఉన్నాయి. అక్రమ నిర్మాణాలు, అనుమతులు తీసుకోకుండా వెలసిన వెంచర్ల వల్ల ప్రభుత్వానికి అదాయం రాలేదు. కోనుగోలు చేసిన వారికి భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు. అయితే సంబంధిత అధికారులు మాత్రం రెండు చేతులా ఆర్జించారన్న అభిప్రాయం కార్పొరేషన్ కార్యాలయ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

అనుమతులు లేని వెంచర్లు, ప్లాట్ల వివరాలు

➤ నగరపాలక సంస్థ పరిధిలోని మామిదాలపాడు వద్ద విజయనగర్ కాలనీ పేరుతో సర్వే నంబర్ 204 బి/1, ఏ2, ఏ1, ఏ2 బి, 205/1, 210బి లోని 4.47 ఎకరాల్లో వెంచర్ వెలిసింది. అలాగే ఇదే ఏరియాలో శ్రీనిలయం పేరుతో 171/2 ఏ, 2ఎఫ్, 1ఏ, 1బి, 2ఏ, 2 బి, 173/1ఏ లోని 1.62 ఎకరాల్లో అనుమతి లేకుండా వెంచర్ ఏర్పాటు చేశారు.

➤ పెద్దపాడులో ప్రగతి లేఅవుట్ పేరుతో సర్వే నంబర్ 38లో 5.8 ఎకరాల్లో అక్రమ లేఅవుట్, అలాగే మంజునాథ్ గ్రీన్ వే కాలనీలో సర్వే నంబర్ 98లో 1.8 ఎకరాలు, శివసాయి నగర్ పేరుతో సర్వే నంబర్ 115, 128, 136లోని 16.3 ఎకరాల్లో అనుమతులు లేకుండా వెంచర్లు వెలిశాయి. సరస్వతి నగర్‌లో 3,77 ఎకరాల్లో వెలసిన వెంచర్‌ను అక్రమ లేఅవుట్‌గా అధికారులు గుర్తించారు.

➤ నగరపాలక సంస్థ పరిధిలోని మునగాలపాడులో వెంకటస్వామి అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి పేరుతో సర్వే నంబర్ 154లో 17 ఎకరాలు, సాయినగర్ కాలనీ పేరుతో సర్వే నంబర్ 212, 213లో 2 ఎకరాలు, రాజరాజేశ్వరీ వెంచర్‌లో సర్వే నంబర్ 202లో 2.5 ఎకరాల్లో వెలసిన వెంచర్‌కు అనుమతులు లేవు.

ట్రిపుల్‌ఐటీ డీఎం నుంచి మొదటి పీహెచ్‌డీ



దారా రాంబాబు

కర్నూలు సిటీ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ డిజైన్ మ్యాన్‌ఫాక్చరింగ్ (ట్రిపుల్‌ఐటీ డీఎం) నుంచి మొట్టమొదటగా దారా రాంబాబు అనే వ్యక్తి పీహెచ్‌డీ పూర్తి చేశారు. బుధవారం ఆ ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐఐటీ తిరుపతి ఆచార్య అనిల్‌కుమార్, ట్రిపుల్ ఐటీ డీఎం ఆచార్య బి.ఎస్ మూర్తి, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.సత్యబాబు, డాక్టరేట్ కమిటీ సభ్యులు జె.కృష్ణయ్య, మణిప్రకాష్, అక్తర్ ఖాన్, ఈశ్వరమూర్తి పాల్గొని పీహెచ్‌డీ పట్టాను అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం జానలగడ్డకు చెందిన రాంబాబు సంస్థ నుంచి మొట్టమొదటగా పీహెచ్‌డీని పూర్తి చేశారన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.మువ్వల పుల్లారావు పర్యవేక్షణలో రాంబాబు ట్రాపజోయిడల్, రాంబస్–ఆకారపు సోలార్ ఎయిర్ హీటర్ డక్ట్స్ మొక్క ద్రవ ప్రవాహం, ఉష్ణ లక్షణాలు గణన, ప్రయోగాత్మకం అనే అంశంపై పరిశోధనలు చేశారన్నారు. సోలార్ ఎయిర్ హీటర్ వేడి గాలిని ఆందిస్తుంది. ఇదీ వ్యవసాయ ఉత్పత్తులను ఎండబెట్టడం, స్పేస్ హీటింగ్, హెచ్‌వీఏసీ సిస్టమ్, కాంక్రీట్ నిర్మాణాలను క్యూరింగ్ చేయడం వంటి అనేక వాస్తవిక అవసరాల కోసం వినియోగించుకునేలా ఉంటుందన్నారు.

నేడు నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ శాఖ చేపట్టనున్న అభివృద్ధి పనుల్లో భాగంగా క్యాంపు సెక్షన్ పరిధిలోని గఫూర్‌నగర్, మాధవీనగర్, అమ్మ ఆసుపత్రి ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ శేషాద్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ నిలిపి వేయనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పూచీకత్తు లేకుండా రుణాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సి.శేషాద్రి

కర్నూలు(సెంట్రల్): పీఎం విశ్వకర్మ యోజన పథకంలో పూచీకత్తు లేకుండా లక్ష రూపాయల రుణాన్ని రజకులకు ఇవ్వాలని ఏపీ రజకవృత్తిదారుల ఓల్డ్ సిటీ నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, జయమ్మ, న్యూసిటీ నగర కమిటీ కార్యదర్శి శేషాద్రి డిమాండ్ చేశారు. బుధవారం చాకలి ఐలమ్మ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. పీఎం విశ్వకర్మ యోజన నిబంధనలు మేరకు ఆన్‌లైన్‌లో దోబీ పరికరాల కోసం నమోదు చేసుకున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఐదు రోజులపాటు శిక్షణ కూడా తీసుకున్నామని, శిక్షణలో ప్రతీరోజూ రూ.500 చెల్లిస్తామని చెప్పారని, నెల రోజులు గడిచినా ఇవ్వలేదన్నారు. అంతేగాక పరికరాల కోసం మంజూరు చేసే రూ.లక్ష రుణానికి పూచీకత్తు లేకపోవడంతో బ్యాంకులు తిరస్కరిస్తున్నాయని చెప్పారు. పీఎం విశ్వకర్మ యోజన పథకంలో పూచీకత్తు లేకుండా రుణాలను మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 16వ తేదీన కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు చెప్పారు. నాయకులు రాముడు, ఎల్లయ్య, మధు, చామంతి పాల్గొన్నారు.

కేంద్రం కక్షపూరిత చర్యలు మానుకోవాలి



మాట్లాడుతున్న ఎండీ అంజిబాబు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం కేరళ రాష్ట్రంపై కక్షపూరిత చర్యలు మానుకోవాలని, కేరళకు అందించాల్సిన ఆర్థిక సాయాన్ని వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్‌చేశారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో సీఐటీయూ, ఏపీకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ కేంద్ర కమిటీల ఉమ్మడి కార్యాచరణలో భాగంగా కేరళ సంఘీభావ సభను నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సభకు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నాగన్న, సీఐటీయూ ఓల్డ్‌సిటీ కార్యదర్శి సీహెచ్ సాయిబాబా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ.. కేరళ రాష్ట్రంపై కేంద్రం అనుసరిస్తున్న విధానాలు మంచివి కావన్నారు. ప్రజలచే ఎన్నికైన ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలని చూడడం తగదన్నారు. అన్ని రాష్ట్రాలకు ఇచ్చిన విధంగా కేరళకు ఆర్థికసాయం అందించాలన్నారు. కేరళకు దాదాపు లక్ష కోట్ల రూపాయల బకాయిలు రావాల్సి ఉందన్నారు. వయనాడ్ విపత్తులో 400 మంది చనిపోయి, వేల కోట్ల ఆస్తి నష్టం సంభవించినా కేంద్రం ఆర్థిక సాయం చేయకపోవడం అన్యాయమని వాపోయారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేద్దాం



శౌర్య దివస్ బైక్ ర్యాలీలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు

కర్నూలు కల్చరల్: హైందవ శంఖారావ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి పిలుపునిచ్చారు. వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన శౌర్య దివస్ బైక్ ర్యాలీని ఓల్డ్ బస్టాండ్‌లోని స్వామి వివేకానంద సంస్కృత పాఠశాల వద్ద ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ వినాయక ఘాట్ వరకు సాగింది. అక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హిందూ సమైక్యతను తెలిపేందుకు జనవరి 5వ తేదీన జరగబోయే హైందవ శంఖారావానికి లక్షలాది మంది తరలి రావాలని పిలుపునిచ్చారు. వీహెచ్‌పీ ప్రాంత సహ కార్యదర్శి కోటేశ్వరరావు ప్రధాన వక్తగా హాజరై ప్రసంగించారు. ఆలయాలను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. హిందువులపై దాడులు జరగకుండా జాగ్రత్తం కావాలన్నారు. లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్య స్వామి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, ఆర్‌ఎస్ఎస్, బీజేపీ, కులసంఘాలు, ధార్మిక సంఘాలు, హిందూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హాస్టల్‌కు ఫ్యాన్లు విరాళం

కర్నూలు(హాస్పిటల్): కలెక్టరేట్ సమీపంలో ఎస్సీ బాలికల వసతి గృహానికి బుధవారపేటలోని స్మైల్ కేర్ డెంటల్ నిర్వాహకులు ఐదు ఫ్యాన్లను విరాళంగా అందజేశారు. బుధవారం ఫ్యాన్లను వసతి గృహం వార్డెన్ సులోచనకు దంత వైద్యులు డాక్టర్ రవిశేఖర్‌బాబు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతలో భాగంగా వసతి గృహానికి ఫ్యాన్లు అందజేసినట్లు చెప్పారు.

ప్రభుత్వానికి కార్మికుల సమస్యలు పట్టవా?

- మూడో రోజుకు చేరిన మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల ఆందోళన
- విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్న కార్మికులు



ధర్నా చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

కర్నూలు (టౌన్): విధులను బహిష్కరించాం. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్నా..ఈ ప్రభుత్వం పట్టిపట్టనట్లు వ్యవహరిస్తోందని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు మనోహర్, నగర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ ఎదుట మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అరకొర జీతాలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం తమకు వేతనాలు పెంచాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. చనిపోయిన కార్మికుడి కుటుంబంలో మరొకరికి ఉద్యోగం కేటాయించాలని డిమాండ్ చేశారు. తమ ప్రధాన డిమాండ్లు పరిష్కరించేంత వరకు సమ్మె వీడమని స్పష్టం చేశారు. అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులు, రమేష్, జ్ఞానమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

22 వరకు విరాళాల సేకరణ

కర్నూలు(సెంట్రల్): ఈ నెల 22వ తేదీ వరకు విరాళాల సేకరణ కార్యక్రమం కొనసాగించాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి కార్యకర్తలకు సూచించారు. నాలుగోరోజు బుధవారం బళ్లారిచౌరస్తా ఏరియాలో అన్వర్‌బాషా, కార్ల్‌మార్క్స్ నగర్‌లో ఈశ్వర్, నల్లన్న, 20వ వార్డులో చంద్రశేఖర్, భద్రకుమార్, బి.తాండ్రపాడులో నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, దేవానగర్‌లో బీసన్న, 19వ వార్డులో సులోచనమ్మ, మునెప్ప, గీతాముఖర్జీ నగర్‌లో ఆశాబేగం, నాగేశమ్మ, రాముడు, బాలస్వామి, శ్రీకాంత్, రామచంద్ర ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కొనసాగింది.

విజేతలకు అభినందన

కర్నూలు (టౌన్): కిడ్స్ వరల్డ్ రోశయ్య కమ్యూనిటీ హాలులో ఈనెల 8వ తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి ఉషూ పోటీల్లో పతకాలు సాధించిన కేవీఆర్ కళాశాల క్రీడాకారులను బుధవారం అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎస్.కుమారి పాల్గొన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు కప్పులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఫిజికల్ డైరెక్టర్ మౌనిక, మాస్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాలకు మరమ్మతులు చేయించండి

నగరంలోని వివిధ కాలనీల్లోని పార్కుల్లో, క్రీడా మైదానాల్లో విరిగిన క్రీడా పరికరాలకు మరమ్మతులు చేయించాలని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. బుధవారం సంకల్‌బాగ్‌లోని పార్కును కమిషనర్ పరిశీలించారు. అనంతరం 125, 126వ సచివాలయాలను తనిఖీ చేశారు. సచివాలయాల వద్ద పరిశుభ్రమైన వాతవరణం నెలకొల్పాలన్నారు. ఎంఈ సత్యనారాయణ, డీఈఈలు కృష్ణలత, గంగాధర్, ఏఈ వైష్ణవి పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే నయం చేయొచ్చు



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శైలేశ్‌కుమార్

కల్లూరు: క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నయం చేయవచ్చునని కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శైలేశ్‌కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని సల్కాపురం గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిగా బరువు తగ్గడం, జ్వరం, అలసట, శరీరములో మార్పులు, అసాధారణ రక్తస్రావం, మలమూత్ర విసర్జనలో మార్పులు, రొమ్ములో గడ్డలు తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చునన్నారు. ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ దంత వ్యాధుల లక్షణాలను వివరించారు.

విజేతకు ఘన సత్కారం



కాంస్య విజేత ప్రతాప్‌ను సత్కరిస్తున్న డీఎస్‌డీఓ, క్రీడా సంఘాల ప్రతినిధులు

కర్నూలు (టౌన్): గత నెల 28వ తేదీ నుంచి ఈనెల 1వ తేదీ వరకు సింగపూర్‌లో నిర్వహించిన పసిఫిక్ షిటోర్యు అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు నగరానికి చెందిన కరాటే మాస్టర్ కోలా ప్రతాప్ పాల్గొని కాంస్య పతకం సాధించారు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకం సాధించిన క్రీడాకారుడిని బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి రామాంజనేయులు పాల్గొని మాట్లాడుతూ.. కరాటే మాస్టర్స్ 45–47 విభాగంలో పతకం సాధించడం గర్వకారణమన్నారు. వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపనిషత్తుల సారాంశమే భగవద్గీత



ఇస్కాన్‌లో ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులు



అనుగ్రహ భాషణం చేస్తున్న చిన్మయ మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతి



భగవద్గీత పారాయణం చేస్తున్న బాలికలు

కర్నూలు కల్చరల్: భగవద్గీత ఉపనిషత్తుల సారాంశమని ప్రముఖ ధార్మిక వేత్త సద్గురు భానుమతి అన్నారు. గీతా జయంతి పురస్కరించుకొని బుధవారం సంకల్ బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో భక్తిశ్రద్ధలతో భగవద్గీత సహస్ర గళ పారాయణం చేశారు. వందలాది మంది భక్తులు పాల్గొని శ్రీకృష్ణ భగవానుడిని తలచుకుంటూ భగవద్గీత పారాయణం చేశారు. భానుమతి, చిన్మయ మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతి, లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి అనుగ్రహ భాషణం చేశారు. భానుమతి మాట్లాడుతూ.. భగవద్గీత పఠనం, శ్రవణంతో ఆలోచనా ధోరణిలో మార్పు సంభవిస్తుందన్నారు. గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డి.వి.రమణ మాట్లాడుతూ.. ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ధ్యానం, భగవద్గీతపై ధార్మిక ప్రవచకులు అనుగ్రహ భాషణం చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు పాల్గొని మాట్లాడారు. తితిదే ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, గీతా ప్రచార సంఘం సభ్యులు జగన్నాథ గుప్త, అనంత అనిల్‌కుమార్, సింహాద్రి రమేష్, మారం అనిల్, మహాబలేష, నాగోజిరావు, సత్యసాయి సేవా ట్రస్ట్ కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, వివిధ ధార్మిక సంస్థల కార్యకర్తలు, సభ్యులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో..

ఇస్కాన్ జగన్నాథ మందిరంలో గీతా జయంతి ఘనంగా నిర్వహించారు. గీతా తులాభారం, రాజభోగ హారతి, గీత యజ్ఞ సంపూర్ణ గీత పారాయణం జరిగింది. ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు సందేశమిచ్చారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సాయి భక్తులకు మహా భిక్ష



సంజీవనగర్‌లోని షిర్డీ సాయి ఆలయంలో భజన చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని దక్షిణ షిర్డీ సాయిబాబా దేవస్థానంలో బుధవారం సాయి దీక్షాపరులకు మహా భిక్ష నిర్వహించారు.సాయినాథునికి భక్తిశ్రద్ధలతో అభిషేకం, అర్చన, పూలాభిషేకం,మహా మంగళహారతి తదితర పూజలు జరిగాయి. సాయి నామస్మరణ, భజనలు చేశారు. అనంతరం వందలాది మంది సాయి దీక్షాపరులు, భక్తులకు మహా భిక్ష ఏర్పాటు చేశారు. గురుస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్లను తరలించండి



విద్యుత్ ఎస్ఈకి సమస్యను వివరిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరంలో రహదారుల విస్తరణ ప్రాంతాల్లో అడ్డంగా, ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను తరలించాలని కమిషనర్ రవీంద్రబాబు విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. బుధవారం విద్యుత్ శాఖ అధికారులతో కలిసి నగరంలోని ఆనంద్ థియేటర్ సమీపంలోని బంగారుపేట, కిసాన్ ఘాట్ రోడ్డు, మదర్ థెరిస్సా కూడళ్లలో ట్రాన్స్‌ఫార్మర్లను తరలించాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. దీనిపై స్పందించిన ట్రాన్స్‌కో ఎస్ఈ ఉమాపతి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే నరసింహారెడ్డి నగర్ రైల్వే స్టేషన్ సమీపంలోని విద్యుత్ శాఖ కార్యాలయం వెనుక భాగంలో రహదారి నిర్మాణానికి సంబంధించిన ప్రదేశాన్ని పరిశీలించారు. స్థానిక కార్పొరేటర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.